TELANGANA RISING 2047

RNI.No. TELTEL/2010/32434

# అన్వేషనేత్రం

ఎడిటర్ : గోళ్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :12 సంచిక : 79 | మంగళవారం 21 జులై 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00



వారి రాక కోసం

## ఎదురు చూస్తున్నాం: ఇరాన్ విదేశాంగ ప్రతినిధి

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై దాడుల్ని మరింత తీవ్రం చేస్తామని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ఇరాన్ చమురు నిల్వలకు కీలక ప్రాంతమైన ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేసే ఏ సాహసానికైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది.

రూ.10వేలు చెల్లించి ఇందిరమ్మ

# ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి



- ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు
- మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు
- డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక
- ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదు.. అద్దెకు ఇవ్వరాదు
- కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం
- ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం
- లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్
- మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం



క్యూర్ పరిధిలో ప్లాట్ల కోసం రేపటి నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవా లని తెలిపారు. డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ప్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

వార్త 2లో



ఫిఫా ఫైనల్ వేళ కలకలం..

## విమానాన్ని తరిమికొట్టిన ఎఫ్-16 ఫైటర్ జెట్లు

అమెరికాలోని న్యూజెర్సీ వేదికగా ఫిఫా ప్రపంచకప్ 026 ఫైనల్ జరిగిన సంగతి తెలిసిందే. అర్జెంటీనా, స్పెయిన్ మధ్య జరిగిన ఈ తుది పోరుకు యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యారు. దీంతో ఆ రాష్ట్రంలోని బెడ్‌మిన్‌స్టర్, ఈస్ట్ రూథర్‌ఫర్డ్ ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

పార్లమెంట్ సమావేశాలు

## సజావుగా సాగేలా చూడాలి: ప్రధాని మోదీ

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు. స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్-1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. ఈరోజు (సోమవారం) పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు.





ట్రైనీ ఐపీఎస్ ఉదయ్

## కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం






కాక్రోజ్ జనతా పార్టీ అధ్యక్షుడు

## అభిజిత్ దీప్కే అరెస్ట్.. ఖండించిన పోలీసులు

కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధ్యక్షుడు అభిజిత్ దీప్కేను అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని ప్రజలకు వారు స్పష్టం చేశారు. అభిజిత్ దీప్కే.. జంతర్ మంతర్ ధర్నా పాయింట్ వద్ద ఉన్నారని ఢిల్లీ పోలీసులు వివరించారు.

పామాయిల్ ధర పెంపునకు మా

## ప్రభుత్వం కృషి చేస్తోంది: భట్టి విక్రమార్క



**ఖమ్మం జిల్లా,**

పామాయిల్ ధర పెంపునకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క (దీప్తుఘ్అ ఎఅనెతీఘుఝతీసు) వ్యాఖ్యానించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా అని పేర్కొన్నారు. ఈ రోజు(సోమవారం) ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం అంజనాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సి ఉందని.. వివిధ కారణాలతో సీఎం రాలేకపోయారని చెప్పుకొచ్చారు.

## షాపులో లేని యూరియా యాప్ లో దొరుకుతుందా?: కెటిఆర్

**హైదరాబాద్:**

ఏ ఒక్క ఊరిలో కాంగ్రెస్ వందశాతం రుణ మాఫీ చేసినట్టు చూపెట్టాలని అడిగానని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. వందశాతం రుణమాఫీ చూపెడితే రాజీనామా చేస్తానని అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ భవన్ లో కెటిఆర్ మీడియాతో మాట్లాడుతూ.. రుణమాఫీ కూడా సక్రమంగా చేయలేదని, షాపులో లేని యూరియా యాప్ లో దొరుకుతదా అని ప్రశ్నించారు. కరెంట్ కూడా సక్రమంగా ఇవ్వడం లేదని, ధాన్యం బస్తాలు కూడా దొరకడం లేదని విమర్శించారు. సంచులన్నీ ఢిల్లీకి పంపుతున్నారని, 4 సార్లు రైతుబంధు ఎగ్గొట్టారని కెటిఆర్ మండిపడ్డారు. కౌలు రైతులకు రూ. 15 వేలు ఇస్తానని మోసం చేశారని, మహిళలకు రూ.2,500 ఇస్తానని దగా చేశారని ధ్వజమెత్తారు. వృద్ధులకు రూ. 4 వేల పెన్షన్ ఇవ్వలేదని, ఒక ఎకరానికి ఒక మీటింగ్ పెడుతున్నారని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం దగ్గర నీళ్లు సముద్రం లోకి వెళ్తున్నాయని, పంప్ ఆన్ చేస్తే నిజాం సాగర్ నిండుతుందని సూచించారు. సిఎం రేవంత్ రెడ్డి చెప్పిన అబద్ధమే ఆయనకు అడ్డం వస్తుందని దుయ్యబట్టారు. లక్ష క్యూసెక్కుల నీరు వృథాగా పోతుందని, రైతులంటే రేవంత్ కు పట్టింపు లేదని కెటిఆర్ ఆవేదన వ్యక్తం చేశారు.



# వారి రాక కోసం ఎదురుచూస్తున్నాం: ఇరాన్ విదేశాంగ ప్రతినిధి

ఇంటర్నెట్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు అంతకంతకూ పెరుగుతూనే ఉన్నాయి. ఇరాన్‌పై దాడుల్ని మరింత తీవ్రం చేస్తామని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. ఇరాన్ చమురు నిల్వలకు కీలక ప్రాంతమైన ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునేందుకు అమెరికా చేసే ఏ సాహసానికైనా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఆ దేశ సైన్యం ఎలాంటి భూతల దండయాత్ర చేసినా.. స్వాగతం పలికేందుకు తాము నిమిషాలు లెక్కిస్తున్నామని ఇరాన్ విదేశాంగ ప్రతినిధి ఇస్మాయిల్ బఘేయి హెచ్చరించారు. 'ఇరాన్‌పై దాడి చేస్తే అమెరికా తీవ్ర పర్యవసానాలు ఎదుర్కోవాలి. ఆ ప్రాంతవాసులు వారి రాక కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు' అని ఆయన అన్నారు. ఇరాన్ తీరానికి 55 కి.మీ. దూరంలో బుషెహర్ ప్రావిన్స్‌లో ఉన్న ఖార్గ్.. ఇరాన్ చమురు పరిశ్రమకు అత్యంత ప్రధానమైంది. ఆ దేశ చమురు ఎగుమతుల్లో సుమారు 90 శాతం ఈ ద్వీపమే నిర్వహిస్తోంది.కాగా.. అమెరికాతో కుదిరిన మధ్యంతర ఒప్పందంపై ఇరాన్ వైఖరిని బఘేయి పునరుద్ఘాటించారు. దానిపై పూర్తి స్పష్టత ఉందని, అందులోని 14 నిబంధనలపై ఎలాంటి సందేహమూ అక్కర్లేదని ఆయన చెప్పుకొచ్చారు. 'హోర్ముజ్ జలసంధి భవిష్యత్తు నిర్వహణ బాధ్యత ఇరాన్‌పైనే ఉంటుందని మేం మొదట్నుంచీ చెబుతూనే ఉన్నాం. అదే విషయాన్ని ఒమన్‌తో సంప్రదింపులు, ప్రాంతీయ దేశాలతో చర్చల ద్వారా ముందుకు తీసుకువెళ్తాం. దౌత్యపరమైన కట్టుబాట్ల నుంచి వాషింగ్టన్ వైదొలగకూడదు. ఈ ఒప్పందం పూర్తి స్పష్టంగా ఉంది. దీనిని ఉల్లంఘించేందుకు అమెరికాకు ఎలాంటి సాకులూ లేవు' అని బఘేయి చెప్పారు.అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఖార్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నంతో పాటు సైనిక చర్యలను ముమ్మరం చేయడం గురించి పదేపదే ప్రస్తావించారు. ఒకవేళ ఖార్గ్‌ను యూఎస్ స్వాధీనం చేసుకుంటే.. ఇరాన్ చమురు ఎగుమతులకు కీలకమైన ఆ ప్రదేశంపై అమెరికా సైన్యం నియంత్రణ సాధించి, ఇరాన్ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి తెచ్చినట్టువుతుంది. అయితే.. ఖార్గ్‌ను స్వాధీనం చేసుకోవడం, ఆక్రమించుకోవడం వల్ల అమెరికాకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు.

# ఫిఫా ఫైనల్ వేళ కలకలం.. విమానాన్ని తరిమికొట్టిన ఎఫ్-16 ఫైటర్ జెట్లు

స్పోర్ట్స్ డెస్క్: అన్వేషనేత్రం ప్రతినిధి

అమెరికాలోని న్యూజెర్సీ వేదికగా ఫిఫా ప్రపంచకప్ 026 ఫైనల్ జరిగిన సంగతి తెలిసిందే. అర్జెంటీనా, స్పెయిన్ మధ్య జరిగిన ఈ తుది పోరుకు యూఎస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరయ్యారు. దీంతో ఆ రాష్ట్రంలోని బెడ్‌మిన్‌స్టర్, ఈస్ట్ రూథర్‌ఫర్డ్ ప్రాంతాల్లో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. అంతేకాక ఆ ప్రాంతాల్లోని గగనతలంలో విమానాల రాకపోకలపై తాత్కాలిక ఆంక్షలు విధించారు. ఈ ఆంక్షలను ఉల్లంఘించి మ్యాచ్ జరిగే ప్రాంతంలోని గగనతలంలో కొన్ని విమానాలను ఎఫ్–16 ఫైటర్ జెట్లు తరిమాయి. ఈ విషయాన్ని నార్త్ అమెరికన్ ఏరోస్పేస్ డిఫెన్స్ కమాండ్ ఓ ప్రకటనలో వెల్లడించింది.ఆంక్షలు ఉన్న ప్రాంతంలోకి 10కి పైగా పౌర విమానాలు ప్రవేశించాయని, వీటిల్లో కొన్ని తమ పొరపాటును గుర్తించి దారిమళ్లాయని అధికారులు తెలిపారు. అయితే మరో మూడు విమానాలను మాత్రం తాము అడ్డుకొని, పంపించాల్సి వచ్చిందని డిఫెన్స్ కమాండ్ వెల్లడించింది. రెండు సందర్భాల్లో పైలట్లను హెచ్చరించేందుకు మంటలు వెలువరించాల్సి వచ్చిందని అధికారులు పేర్కొన్నారు. దేశాధినేత భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, అలానే ప్రజలకు ఎలాంటి ప్రమాదం లేకుండా ఫైటర్ జెట్లు ఆ మంటలు వెలువరించాయని రక్షణ దళ అధికారులు తెలిపారు.ఈస్ట్ రూథర్‌ఫర్డ్‌లోని మెట్‌లైఫ్ స్టేడియంలో స్పెయిన్– అర్జెంటీనా మధ్య నువ్వానేనా అన్నట్టు జరిగిన ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ మ్యాచ్‌ను ట్రంప్ (ఐశీఖుశ్రీఃస ుతీబవఎజూ) వీక్షించారు. ఈ మ్యాచ్ సమయంలో స్టేడియంలో ప్రపంచస్థాయి క్రీడాకారులు, ప్రముఖులు, భారీ సంఖ్యలో ఫుట్‌బాల్ అభిమానులు ఉన్నారు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే... అర్జెంటీనాపై స్పెయిన్ 1–0 తేడాతో విజయం సాధించి.. విశ్వ విజేతగా నిలిచింది. ఇక మ్యాచ్ ప్రారంభానికి ముందు స్టేడియంలోకి రావడానికి ముందు ట్రంప్ కొద్దిసేపు విహంగ వీక్షణం చేశారు.

# కాక్రోజ్ జనతా పార్టీ అధ్యక్షుడు అభిజిత్ దీప్కే అరెస్ట్.. ఖండించిన పోలీసులు

న్యూఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

కాక్రోజ్ జనతా పార్టీ (సీజేపీ) అధ్యక్షుడు అభిజిత్ దీప్కేను అరెస్ట్ చేశారంటూ వస్తున్న వార్తలను ఢిల్లీ పోలీసులు ఖండించారు. సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్, అసత్య ప్రచారాలను నమ్మ వద్దని ప్రజలకు వారు స్పష్టం చేశారు. అభిజిత్ దీప్కే .. జంతర్ మంతర్ ధర్నా పాయింట్ వద్ద ఉన్నారని ఢిల్లీ పోలీసులు వివరించారు. అభిజిత్‌ను పోలీసులు అదుపులోకి తీసుకోవడం కానీ.. అరెస్ట్ చేయడం కానీ జరగలేదని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది.నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలోని లోపాల నేపథ్యంలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. పదవికి రాజీనామా చేయాలని కాక్రోచ్ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. ఈ నేపథ్యంలో ఈ రోజు (సోమవారం) చలో పార్లమెంట్‌కు ఆ పార్టీ పిలుపునిచ్చింది. ఈ యాత్రకు ఢిల్లీ పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఈ యాత్రలో భారీగా యువత పాల్గొంది. ఈ యాత్రను అడ్డుకునేందుకు పోలీసులు ఎక్కడికక్కడ భారీగా ఏర్పాట్లు చేశారు. అయినా నిరసనకారులు భారీ సంఖ్యలో పార్లమెంట్ వైపునకు దూసుకెళ్లారు. వారిని నిలువరించేందుకు పోలీసులు లాఠీ ఛార్జ్ చేశారు. భాష్పవాయుగోళాలు ప్రయోగించారు. దీంతో నిరసనకార్లు.. పోలీసులపైకి రాళ్లు రువ్వారు. పలువురు పోలీసులకు గాయాలయ్యాయి. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది.

### గీతాంజలిపై దాడి..

ఇంకోవైపు ఈ యాత్రలో పాల్గొన్న సోనమ్ వాంగ్ చుక్ భార్య గీతాంజలి జుట్టు పట్టుకుని ఢిల్లీ పోలీసులు లాగారు. దీంతో గీతాంజలిపై పోలీసులు దాడి చేశారంటూ సీజేపీ ఆరోపించింది. ఈ ర్యాలీలో పాల్గొన్న 12 ఏళ్ల బాలికపై పోలీసులు దాడి చేశారని.. దీంతో ఆమె తల పగిలిందని వివరించింది. మరో 40 నుంచి 50 మంది సీజేపీ కార్యకర్తల తలలు పగిలిపోయాయని కాక్రోచ్ జనతా పార్టీ ప్రకటించింది.

### నేటి నుంచి వర్షా కాల సమావేశాలు..

సోమవారం నుంచి పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. దీంతో పార్లమెంట్, జంతర్ మంతర్‌తోపాటు ఢిల్లీలోని వివిధ ముఖ్య ప్రాంతాల్లో పోలీసులు భారీగా మోహరించారు. జూన్ 28వ తేదీ నుంచి నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌ను శనివారం బలవంతంగా సఫ్దర్ జంగ్ ఆసుపత్రికి తరలించారు. కాక్రోచ్ జనతా పార్టీ పిలుపునిచ్చిన చలో పార్లమెంట్ యాత్రకు ఆయన మద్దతు తెలిపిన సంగతి తెలిసిందే.

# రూ.10వేలు చెల్లించి ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకోవాలి

**ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు**

**మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు**

**డ్రా పద్ధతిలో లబ్ధిదారుల ఎంపిక**

**ఫ్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదు**

**కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం**

**ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం**

**లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్**

**మంత్రులు పొంగులేటి, శ్రీధర్ బాబు, పొన్నం**

హైదరాబాద్, అన్వేషనేత్రం ప్రతినిధి

క్యూర్ పరిధిలో ఫ్లాట్ల కోసం రేపటి నుంచి ఆగస్టు 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వ్యాఖ్యానించారు. మీ సేవ, వాట్సాప్, వెబ్‌సైట్‌లో వీటికోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. రూ.10వేల టోకెన్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డ్రా పదతిలో లబిదారుల ఎంపిక ఉంటుందని స్పష్టం చేశారు. డ్రాలో ఇల్లు రానివారి డబ్బులు వెంటనే చెల్లిస్తామని వెల్లడించారు. ఆయా ఫ్లాట్లు పదేళ్ల పాటు అమ్మరాదని.. అద్దెకు ఇవ్వరాదని షరతును విధిస్తామని అన్నారు. కుటుంబంలో ఒకరికి ఇళ్లకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.

### వారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తాం..

క్యూర్ పరిధిలో ఇల్లు, స్థలం లేనివారికి తొలివిడతలో ప్రాధాన్యం కల్పిస్తామని మంత్రి చెప్పుకొచ్చారు. లబ్ధిదారుల పేరిట స్థలం రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. స్థలంతో పాటు రూ.5లక్షల సబ్సిడీ అందజేస్తామని పేర్కొన్నారు. ఈరోజు (సోమవారం) ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన వాట్సాప్ దరఖాస్తులు, ూ×+ ఇళ్ల బ్రోచర్‌లను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడారు.

### రూ.5లక్షల సహాయం అందజేస్తాం..

వారికి స్థలం ఇవ్వడంతో పాటు రూ.5లక్షల సహాయం అందజేస్తామని మంత్రి పొంగులేటి వెల్లడించారు. పదేళ్ల వరకు ఇళ్లు అమ్ముకునే అవకాశం లేదని చెప్పుకొచ్చారు. జఖ=జులో మొదటి దశలో 16నియోజకవర్గాల్లో ఇస్తున్నామని.. త్వరలోనే మిగిలిన నియోజకవర్గాల్లో కూడా ఇళ్లు ఇస్తామని స్పష్టం చేశారు. ఆయా పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా ఇళ్లను కేటాయిస్తామనిపేర్కొన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అవుతున్నాయని ఇప్పటికే రెండు విడతల్లో ఏడు లక్షల ఇళ్లు మంజూరు చేశామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు సొంత స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లు అందజేశామని వెల్లడించారు.

### ఇంటి స్థలంలేని పేదల కల నెరవేరుస్తాం..



ఇంటి స్థలంలేని పేదలకు కూడా వీటిని అందజేయాలని తమ ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి పొంగులేటి వివరించారు. లాభం, స్వార్థం లేకుండా పేదలకు ఇళ్లు నిర్మించి అందజేస్తున్నామని పేర్కొన్నారు. జఖ=జు పరిధిలో ఇళ్లు కట్టించే పథకాన్ని ఈ రోజు ప్రారంభించామని తెలిపారు. ఇందుకోసం పదహారు నియోజకవర్గాల్లో స్థలాలు ఎంపిక చేశామని చెప్పుకొచ్చారు. 528 అడుగుల చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఫ్లాట్లను నిర్మిస్తున్నామని వెల్లడించారు. కేసీఆర్ హయాంలో తప్పిదాలతో అప్పుడు కట్టిన ఫ్లాట్లు ఉపయోగపడకుండా పోయాయని చెప్పారు. నగరానికి దూరంగా 35 కిలోమీటర్ల దూరంలో కట్టడంతో పేదలు అక్కడకు వెళ్లలేదని తెలిపారు.

### పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారు..

చదరపు గజానికి లక్షల విలువ ఉండే కోర్ ప్రాంతంలో టవర్లు నిర్మించి పేదలకు ఇస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు ఇళ్లు ఇస్తామంటే కొందరు హేళన చేశారని అన్నారు. ఈ పథకం ఫెయిల్ అయితే విమర్శించాలని కొందరు



సంతోషపడ్డారని చెప్పుకొచ్చారు. రాష్ట్రానికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నా పేదలకు ఇంటి కల నెరవేర్చాలని తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో కూడా ఇలా ఇళ్లు కట్టించి ఇవ్వడం లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు

### పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు: మంత్రి శ్రీధర్ బాబు

గుడిసెలు లేని తెలంగాణ రాష్ట్రం తమ ప్రభుత్వం లక్ష్యమని మంత్రి శ్రీధర్ బాబు వ్యాఖ్యానించారు. ఆ లక్ష్యంతోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. నాలుగు దశాబ్దాల క్రితమే కాంగ్రెస్ ప్రభుత్వం ూ×+ ఇళ్లను నిర్మించిందని తెలిపారు. నగరంలో చాలాచోట్ల హౌసింగ్ బోర్డు కాలనీలు ఉన్నాయని ప్రస్తావించారు. ఎంత విలువైన భూమి అయినా పేదలకు ఇవ్వాలని తాము నిర్ణయించామని చెప్పుకొచ్చారు. పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు జరుగుతోందని స్పష్టం చేశారు. ఇళ్ల కేటాయింపుల్లో రిజర్వేషన్లు అమలు చేస్తామని తెలిపారు. మొదటి విడతలో 16నియోజకవర్గాల్లో 7680 ఫ్లాట్లను నిర్మిస్తామని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు.

### హౌసింగ్ విభాగాన్ని పునరుద్ధరించాం: మంత్రి పొన్నం ప్రభాకర్

పరిధిలోని ప్రజలకు మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లో స్థలం లేని పేదలు కిరాయి ఇళ్లలో ఉంటున్నారని తెలిపారు. లో పేదలకు తమ ప్రభుత్వమే స్థలం ఇచ్చి ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకునే పథకాన్ని ప్రారంభించామని వెల్లడించారు. గత ప్రభుత్వం హౌసింగ్ విభాగాన్నే రద్దు చేసిందని చెప్పుకొచ్చారు. తాము దాన్ని పునరుద్ధరించామని అన్నారు. బల్కంపేట ఎల్లమ్మ బోనాల ముందు జఖ=జులో ఈ పథకం ప్రారంభించామని వెల్లడించారు. మళ్లీ వచ్చే బోనాల నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని టార్గెట్‌గా పెట్టుకున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలి: ప్రధాని మోదీ

ఢిల్లీ, అన్వేషనేత్రం ప్రతినిధి

పార్లమెంట్ సమావేశాలు సజావుగా సాగేలా చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ వ్యాఖ్యానించారు. ఈ సమావేశాలు నిర్మాణాత్మకంగా జరుగుతాయని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. గత నెల రోజులుగా దేశంలో అనేక పరిణామాలు జరిగాయని వెల్లడించారు. అంతరిక్ష ప్రస్థానంలో నవశకం ప్రారంభమైందని తెలిపారు.స్టార్టప్ కంపెనీ తయారు చేసిన విక్రమ్–1 రాకెట్ విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లిందని వివరించారు. ఈరోజు (సోమవారం) పార్లమెంట్ దగ్గర మీడియాతో ప్రధాని మాట్లాడారు. భారత అంతరిక్ష ప్రస్థానంలో కీలక ఘట్టం ఆవిష్కృతమైందని ఉద్ఘాటించారు. భారతదేశ యువత అంతరిక్షంలోకి దూసుకుపోయిందని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు. విక్రమ్–1 విజయం వెనుక యువత పాత్ర కీలకమని తెలిపారు. స్కైరూట్ విజయవంతం అవడం దేశానికి గర్వకారణమని పేర్కొన్నారు. రాజస్థాన్‌లో అతిపెద్ద ఆయిల్ రిఫైనరీని దేశానికి అంకితం చేశామని వెల్లడించారు. ఒక సెమీ కండక్టర్ ప్లాంట్, గ్రీన్ హైడ్రోజన్ రైలును ప్రారంభించామని తెలిపారు. యుద్ధంతో చాలా దేశాలకు నష్టం జరుగుతోందని చెప్పారు. చమురు ధరలు అమాంతం పెరుగుతున్నాయని తెలిపారు. 7.7శాతం గ్రోత్‌రేట్ భారత్ నమోదు చేస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నం.. పరిస్థితి విషమం

హైదరాబాద్,

ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి ఆత్మహత్యకు యత్నించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆయనను ఆస్పత్రికి తరలించారు. ఎర్రగడ్డలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కృష్ణారెడ్డికి చికిత్స అందిస్తున్నారు. నిన్న(ఆదివారం) కృష్ణారెడ్డిపై లైంగిక వేధింపుల కేసు నమోదైన విషయం తెలిసిందే. తనను లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ ట్రైనీ ఐపీఎస్‌పై మరో మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు చేశారు. దీంతో అత్తాపూర్ పోలీసులు కృష్ణారెడ్డిపై బీఎన్ఎస్‌లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ అంశంపై ఎనిమిది రోజుల్లోగా వివరణ ఇవ్వాలంటూ ట్రైనీ ఐపీఎస్‌కు పోలీసులు నోటీసులు కూడా జారీ చేశారు. అయితే ఈ ఘటన అనంతరం సొంతూరుకు వెళ్లిపోయిన కృష్ణారెడ్డి.. నిన్న సాయంత్రం మోతీనగర్‌లోని స్నేహితుడి ఇంటికి వచ్చినట్లు తెలుస్తోంది.

# గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం..

ఖమ్మం జిల్లా: అన్వేషనేత్రం ప్రతినిధి

కొనిజర్ల మండలం అంజనాపురంలో నిర్మించిన గోద్రెజ్ ఆయిల్ పామ్ ఫ్యాక్టరీని తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లాలో గోద్రెజ్ కంపెనీ ఆయిల్ పామ్ కాంప్లెక్స్ నిర్మించడం సంతోషంగా ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. ఈ కాంప్లెక్స్‌లో అత్యాధునిక సీడ్ గార్డెన్ ఏర్పాటు చేశారని తెలిపారు. గోద్రెజ్ కంపెనీకి అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని, రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండేలా కంపెనీ సేవలందించాలని ఆకాంక్షించారు.ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ ముందు ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. రాష్ట్రంలో పది లక్షల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగుకు కృషి జరుగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా రైతులంతా ఈ పంట సాగుకు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. ఆయిల్ పామ్‌తో ఎలాంటి నష్టం ఉండదన్నారు. ఆయిల్ పామ్ కింద ఇప్పటికే మూడు ఫ్యాక్టరీల నిర్మాణం పూర్తయిందని, మరో ఆరు ఫ్యాక్టరీల నిర్మాణం జరుగుతోందని వెల్లడించారు. తెలంగాణ భూములు ఆయిల్ పామ్ సాగుకు అనుకూలమని మంత్రి పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అన్ని జిల్లాల్లో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీల నిర్మాణం జరగాలన్నదే తన లక్ష్యమని చెప్పుకొచ్చారు. దక్షిణ భారతదేశ నేతలందరూ ఆయిల్ పామ్ దిగుమతిపై సుంకం తగ్గించాలని కోరుతున్నామని మంత్రి చెప్పారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.రైతులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నామని, ఆయిల్ పామ్ సాగుతో వారి జీవితాల్లో వెలుగులు నింపుతామన్నారు మంత్రి తుమ్మల. తన యాభై సంవత్సరాల వ్యవసాయ అనుభవంలో ఎన్నో పంటలు పండించామని, ఏ పంటకు రాని ఆదాయం దీనికి వస్తుందన్నారు. ఆయిల్ పామ్‌ను ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన నాటి నుంచి తాను కూడా సాగు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మరోవైపు, ఎల్‌నినో ప్రపంచాన్ని కబళించే పరిస్థితి ఉందని మంత్రి తుమ్మల పేర్కొన్నారు. దాని కారణంగా రుతుపవనాలు సరిగా రాలేదని, మానవజాతి చేసిన విధ్వంసం తిరిగి మన పాలిటే మహమ్మారిగా మారిందన్నారు. దక్షిణ భారతదేశంలో ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని, ఉద్యానవన పంటల సాగుతో భూములను చల్లబరచాలని మంత్రి తుమ్మల పేర్కొన్నారు.



RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

# ఉద్యమాలపై మోడీ మొండివైఖరి






ప్రజా ఉద్యమాలంటే గిట్టని పాలక వర్గాలు వాటిని భగ్నం చేయడానికి ఎన్నో ప్రయత్నాలు చేస్తుంటారు. ముఖ్యంగా మోడీ ప్రభుత్వం ఎంత నిర్లక్షంగా వ్యవహరిస్తుందో గత కొన్నేళ్లుగా మనం చూస్తున్నదే. రైతు ఉద్యమాల నుంచి మణిపూర్ ఆందోళనలు, నేపాల్ జెన్‌జీ ఉద్యమాలు ఇవన్నీ పాలకవర్గాల నిరంకుశ విధానాలకు ప్రత్యక్ష సాక్షాలు. అదే విధంగా వైద్య విద్య జాతీయ ప్రవేశ పరీక్ష పత్రం పదేపదే లీక్ కావడం, ఒకరి మార్క్‌షీటుకు బదులు మరొకరి షీటు ఆధారంగా మార్కులు వేయడం ఇవన్నీ భావితరాలను తీవ్ర నిస్పృహ లోకి నెట్టేయడంతో సంబంధిత అభ్యర్థులు కొంతమంది ఆత్మహత్య చేసుకునే దుస్థితి ఏర్పడింది. ఈనేపథ్యంలో మొత్తం విద్యావ్యవస్థనే మార్చాలని, బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యామంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని, మృతులైన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం సానుభూతి ప్రకటిస్తూ నష్టపరిహారం చెల్లించాలని తదితర డిమాండ్లతో కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) గత నెల 6 నుంచి ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేస్తోంది వాంగ్‌చుక్ సుమారు 10 కిలోల బరువు తగ్గి చాలా బలహీనం అయ్యారు. దీక్షను విరమించాలని వైద్యులు హెచ్చరించినా ఆయన ఖాతరు చేయడం లేదు. కొంతమంది నాయకులు, సంస్థలు ఈ ప్రభుత్వం మొండిదని, ఎన్ని దీక్షలు చేసినా చలించదని అందుకని దీక్ష విరమింప చేయడమే ఆరోగ్యానికి మేలని హితవు పలకగా, తాను దీక్ష విరమిస్తే ప్రభుత్వాలకు జవాబుదారీతనం అవసరం లేదన్న అభిప్రాయం కలగదా? అని వాంగ్‌చుక్ ప్రశ్నించడం గమనార్హం. ఈనెల 20న చేపట్టనున్న పార్లమెంట్ మార్చ్ వరకు తాను ప్రాణాలతోనే ఉంటానని, ఒకవేళ అది సాధ్యం కాకపోతే ఆత్మగా అయినా సరే తిరిగి వస్తానని వాంగ్‌చుక్ స్పష్టం చేయడం ఆయన మనోబలాన్ని తెలియజేస్తుంది. ఈ సందర్భంగా 'దేశంకోసం ప్రాణాలర్పించిన వారికి మరణమే ఉండదు. ఆదర్శాల రూపంలో వారు బతికే ఉంటారు. మనుషులను చంపగలరేమో కానీ వారి ఆలోచనలను మాత్రం చంపలేరు. ఆలోచనల ద్వారా ప్రజల్లో తీసుకు వచ్చిన చైతన్యాన్ని, దాని వల్ల వచ్చిన విప్లవాన్ని ఎవరూ అణచివేయలేరు' అని భగత్‌సింగ్ చెప్పిన మాటలు గుర్తుతెచ్చుకోవాలి. వాంగ్‌చుక్ సామాన్య వ్యక్తి కాదు. ఒక రాజకీయ పార్టీ నాయకుడు కాదు. పర్యావరణమే పరమహితంగా ఉద్యమాలు చేపట్టి అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రముఖులు. అటువంటి ఉద్యమనేత ఢిల్లీ నడిబొడ్డున నిరాహార దీక్ష సాగిస్తుంటే కేంద్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు చూస్తోంది. నిరుద్యోగ యువతను బొద్దింకలు (కాక్రోచ్)తో పోలుస్తూ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ మిశ్రా చేసిన వ్యాఖ్యలపై తీవ్ర రాద్ధాంతం జరిగి అభిజిత్ దిప్కే నేతృత్వంలో కాక్రోచ్ జనతా పార్టీ ఆఫ్ ఇండియా (సిజెపిఐ) ఏర్పడి సంచలనం కలిగిస్తున్న సంగతి తెలిసిందే. రెండు రోజుల్లోనే సిజెపి సోషల్ మీడియాకు రెండు కోట్ల మంది ఫాలోయర్లు చేరారంటే సిజెపి బలాన్ని తక్కువ అంచనా వేయలేం. వీరు వైరస్ లాంటివారని, తుక్డేతుక్డే గ్యాంగ్ అని, వీరి వెనుక విదేశీ శక్తులున్నాయని బిజెపి ప్రచారం చేయడం ఎంతవరకు సమంజసం? బలవంతమైన సర్పం చలిచీమల చేత చిక్కి చావదె సుమతీ అని సుమతీ శతకకారుడు చెప్పినట్టు కాక్రోచ్‌ల బలం పెరిగి పోరాటం తీవ్ర రూపం దాల్చితే ప్రభుత్వాలు ఏమవుతాయో ఆలోచించుకోవాలి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన దగ్గర నుంచి ప్రజా ఉద్యమాలను అణగదొక్కడం పాలక వర్గాలకు సహజంగా వచ్చిన ప్రావీణ్యం. స్వాతంత్ర్యం సిద్ధించిన ఐదేళ్లకు గాంధేయవాది పొట్టిశ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర అవతరణ కోసం 58 రోజులపాటు ఆమరణ దీక్ష చేస్తేనే కానీ రాష్ట్రం సిద్ధించలేదు. ఆయన చనిపోయిన నాలుగు రోజుల తరువాత అప్పటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బలవంతంగా ఆంధ్ర రాష్ట్రాన్ని ప్రకటించారు. 2021లో కేంద్రం తీసుకువచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను వ్యతిరేకిస్తూ భారతీయ కిసాన్ యూనియన్ నాయకత్వంలో దేశవ్యాప్తంగా 40 రైతు సంఘాల మద్దతుతో మూడు లక్షల మంది రైతులు ఢిల్లీ సరిహద్దుల్లో సాగిన ఉద్యమం సంగతి తెలిసిందే. అప్పటికి ఉత్తరప్రదేశ్, పంజాబ్ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరుగనుండడాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతో 2021 నవంబరు 29న మూడు వ్యవసాయ చట్టాలను ప్రభుత్వం రద్దు చేయక తప్పలేదు. ఇది రైతులపై ప్రేమతో కాదు, రాజకీయ లబ్ధి కోసమే అన్నది అందరికీ తెలిసిందే. ఆ రైతు ఉద్యమంలో దాదాపు 500మంది రైతులు చనిపోయారని అప్పటి మేఘాలయ గవర్నర్ సత్యపాల్ మాలిక్ ప్రధాని మోడీకి విన్నవించగా, వారు ఎవరికోసం మరణించారు? నా కోసమా? అని మోడీ ఎదురు ప్రశ్నించడం బట్టి ఆయనకు రైతులన్నా, ఉద్యమకారులన్నా ఎంతటి నిర్లక్ష భావమో తెలుస్తుంది. 2021లో తమిళనాడులో నీట్ పరీక్షకు వ్యతిరేకంగా ప్రజల్లో తిరుగుబాటు జరిగింది. నీట్ పరీక్ష ప్రత్యేక కోచింగ్ తీసుకోగల సంపన్నుల పిల్లలకే అనువైనదని, పేదల, గ్రామీణ బలహీనవర్గాల పిల్లల ఆశలను అది చిదిమి వేస్తుందన్న భావనతో అప్పటి తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానాలు ఆమోదించినా, రాష్ట్రపతి ఆమోదం లభించక అది వమ్ము అయిపోయింది. అప్పుడే నీట్ పరీక్షకు నిరసనగా 15 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఇప్పుడు వాంగ్‌చుక్ నిరాహార దీక్షకు అంతకంతకూ వివిధ వర్గాల నుంచి మద్దతు లభిస్తోంది. వామపక్ష నేతలు, టిఎంసి, ఆర్‌జెడి, ఎస్‌పి నేతలు, ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ మద్దతు పలికారు. ఇప్పటికైనా మోడీ ప్రభుత్వం మొండిపట్టుదల విడిచిపెట్టి చర్చలు సాగించడం ప్రజాస్వామ్య సంప్రదాయం.

# భారత ఇంధన ఎగుమతులు పెరుగుదల

**న్యూఢిల్లీ :**

రష్యా రిఫైనరీలపై దాడులు తీవ్రం కావడంతో ప్రపంచ ఇంధన మార్కెట్‌లో తీవ్ర ఇబ్బందులు మొదలయ్యాయి. దీంతో ఆ కొరతను భర్తీ చేయడానికి భారత్ తన ఇంధన ఉత్పత్తుల ఎగుమతులను వేగవంతం చేసింది. ప్రైవేటు రంగంలోని రిలయన్స్ ఇండిస్టీస్, నయారా ఎనర్జీ సంస్థలు బ్రెజిల్, తుర్కియే, యుఎఇ, పలు ఆఫ్రికా దేశాలకు భారీగా ఎగుమతి చేస్తున్నాయి. ఇప్పటి వరకు ఆయా దేశాలు రష్యాలో శుద్ధి చేసిన ఇంధనంపై ఇన్నాళ్లు ఆధారపడ్డాయని ఎకనామిక్ టైమ్స్ కథనంలో పేర్కొంది. చమురు శుద్ధి సామర్థ్యం దెబ్బతినడంతో రష్యా దేశీయ అవసరాలపైనే ఎక్కువ దృష్టి సారించింది. శీతాకాలం సమీపిస్తుండటంతో.. రష్యాలో చమురు అవసరాలు భారీగా పెరగనున్నాయి. దీంతో సెప్టెంబర్ నెలలో రోజుకు రెండు లక్షల బ్యారెళ్ల ఇంధన ఎగుమతులను తగ్గించిందని క్లెప్లర్ నివేదికలో వెల్లడించింది. రిఫైనరీలు దెబ్బతినడం, పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై నిషేధం వంటివి ప్రభావం చూపాయని ఆ సంస్థ నిపుణులు వెల్లడించారు. భారత్ నుంచి బ్రెజిల్‌కు శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు పెరిగి రోజుకు 97 వేల బ్యారెళ్లకు చేరాయి. ఆగస్టులో ఇవి కేవలం 40 వేల బ్యారెళ్లు మాత్రమే ఉన్నాయి. ఇక మన దేశం నుంచి తుర్కియేకు కూడా ఎగుమతులు అంతకు ముందు నెలతో పోలిస్తే 20 వేల బ్యారెళ్ల నుంచి 56 వేల బ్యారెళ్లకు చేరాయి. గతేడాది అసలు మన దేశం నుంచి తుర్కియేకు చమురు ఎగుమతి చేయలేదు. పై రెండు దేశాలకు అధికంగా రిలయన్స్ ఇండిస్టీస్ నుంచి ఎగుమతులు అవుతున్నాయి.



## కార్ల అమ్మకాలకు జిఎస్‌టి జోష్

ఇక యుఎఇకి భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతి పెరిగింది. ఆగస్టులో 1.4 లక్షల బ్యారెళ్లు కొనుగోలు చేయగా.. సెప్టెంబర్‌లో 2.01 లక్షల బ్యారెళ్లకు చేరడం గమనార్హం. మొత్తంగా భారత్ నుంచి శుద్ధి చేసిన ఇంధన ఎగుమతులు గత నెల ఏకంగా 14 శాతం పెరిగి రోజుకు 1.59 మిలియన్ పీపాలుగా నమోదయ్యాయి.

# కంపెనీ అవసరాలు తీర్చలేని వారు ఇంటికే

## చర్యలు ప్రారంభించిన టిసిఎస్

**న్యూఢిల్లీ :**

ప్రఖ్యాత ఐటి సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టిసిఎస్) లేఆఫ్‌ల ప్రక్రియను ప్రారంభించింది. ప్రస్తుత ఆటోమేషన్ యుగంలో కంపెనీ అవసరాలను తీర్చలేని ఉద్యోగులను ఇంటికి పంపిస్తోంది. అయితే, దీర్ఘకాలం కంపెనీతో అనుబంధం కలిగిన ఉద్యోగులకు మాత్రం దాదాపు రెండేళ్ల వేతనం పరిహారంగా చెల్లించనుంది. ఈ ఏడాది జులైలో ప్రకటించిన 12 వేల మందికి లేఆఫ్‌ల ప్రకటనలో భాగంగా ఈ ప్రక్రియను చేపట్టింది. క్లయింట్ అవసరాలు తీర్చలేని, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నైపుణ్యాలు లేని ఉద్యోగులను టిసిఎస్ తొలగిస్తోంది. ఇందులో భాగంగా మూడు నెలల నోటీసు పీరియడ్ ఇస్తోంది. అంటే ఆ మూడు నెలలకు కంపెనీ వేతనంగా చెల్లిస్తుంది. దీనికి అదనంగా ఆరు నెలల నుంచి 2 ఏళ్ల వరకు వేతనాన్ని పరిహార ప్యాకేజీ కింద చెల్లించనుంది. అయితే, ఎవరైతే 8 నెలలకు మించి బెంచ్‌పై ఉంటారో వారికి 'సింప్లర్ ప్యాకేజీ' మాత్రమే చెల్లిస్తారు. అంటే నోటీసు పీరియడ్ వేతనాన్ని మాత్రమే చెల్లిస్తారు.

## గరిష్టంగా రెండేళ్లు

కంపెనీలో 10–15 ఏళ్లుగా ఉద్యోగం చేస్తూ తాజా లేఆఫ్‌లలో ఉద్యోగం కోల్పోయిన వారికి ఏడాదిన్నర వేతనాన్ని పరిహారంగా చెల్లిస్తారు. అదే 15 ఏళ్లు దాటిన వారికి గరిష్టంగా రెండేళ్ల వేతనంగా ఇస్తారు. దీంతోపాటు అదనంగా ఔట్‌ప్లేస్‌మెంట్ సేవలు లభిస్తాయి. అవసరమైన వారికి టిసిఎస్ కేర్స్ ప్రోగ్రామ్ కింద మానసిక ఆరోగ్యానికి సంబంధించిన చికిత్స లేదా థెరపీని అందిస్తారు. దీంతో పాటు రిటైర్మెంట్‌కు దగ్గరపడిన వారికి ముందస్తు ఉద్యోగ విరమణకు టిసిఎస్ అవకాశం కల్పిస్తోంది. వీరికి 6 నెలల నుంచి 2 ఏళ్ల వరకు వేతనాన్ని పరిహార ప్యాకేజీ చెల్లించడంతోపాటు బీమా ప్రయోజనాలను కల్పిస్తారు.




RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్ : గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

## బిజినెస్..

# పాత జిఎస్టి చివరి నెల ఆదాయం 3,653 కోట్లు

**అమరావతి :**

పాత జిఎస్టి ధరల మేరకు సెప్టెంబర్ నెలలో 3,653 కోట్లు వసూలైంది. ఈ ధరల మేరకు ఇదే చివరి నెల కావడం విశేషం. అయితే గత నెలలో చివరి తొమ్మిది రోజులు కొత్త జిఎస్ టి స్లాబులు అమలులోకి వచ్చినప్పటికీ మెజార్టీ రోజులు పాత స్లాబుల్లోనే ఉన్నాయి,. దీంతో ఆ నెలలో వచ్చిన ఆదాయాన్ని అంతా పాత జిఎస్టి కిందకే లెక్క వేసినట్లు అధికారులు చెబుతున్నారు. అక్టోబర్ కు సంబంధించి గణాంకాలు నవంబర్ లో సిద్ధమవుతాయని, వాటి ఆధారంగా కొత్త జిఎస్ టి స్లాబుల వల్ల కలిగే లాభ నష్టాలను అంచనా వేయడం సాధ్యమవుతుందని అంటున్నారు. తాజాగా వాణిజ్య పన్నులశాఖ వెల్లడించిన వివరాల మేరకు సెప్టెంబర్ 3,653 కోట్లు జిఎస్టిగా సమకూరింది. గత ఏడాది సెప్టెంబర్ నెల్లో 3,506 కోట్లు వసూలు కాగా, తాజా ఆదాయం సుమారుగా 650 కోట్లు ఎక్కువగా వచ్చింది. ఈ ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబర్ వరకు మొత్తం పన్నుల వసూళ్లు 26,685 కోట్లుగా తేలింది. ఇందులో జిఎస్టి ద్వారా 17,556 కోట్లు రాగా, రద్దయిన పాత పన్ను చట్టాల ద్వారా 127 కోట్లు, పెట్రోలియం ఉత్పత్తుల ద్వారా వచ్చే వ్యాట్ నుంచి 8,245 కోట్లు, మద్యంపై వ్యాట్ ద్వారా 494 కోట్లు, వృత్తి పన్ను ద్వారా 264 కోట్లు వచ్చినట్లు తేల్చారు. గత ఏడాది సెప్టెంబర్ వరకు పోల్చిచూస్తే పెట్రో ఉత్పత్తుల ద్వారా మాత్రం కేవలం 1.72 శాతమే ఆదాయం పెరగడం గమనార్హం. 2024లో 8,105 కోట్లు రాగా, ఈ ఏడాది 8,245 కోట్లు మాత్రమే పన్ను రూపంలో చేతికందింది.

## రెట్టింపైన వసూళ్లు

జిఎస్టి అమలు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు జిఎస్టి వసూళ్లు రెట్టింపయ్యాయి. గతేడాది కన్నా ఈ సెప్టెంబర్ లోనే కొంత వసూళ్లు పెరగడం విశేషం. 2017 సెప్టెంబర్లో 1,802 కోట్లు జిఎస్టి రూపంలో రాగా, 2018లో 2,023 కోట్లు, 2019లో 1,985 కోట్లు చేతికందాయి. ఆ తరువాత క్రమంగా పెరుగుతూ 2023 నాటికి 3,658 కోట్లుగా వసూళ్లు నమోదైంది.





తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రివర్యులు గౌరవనీయులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి గారినీ సచివాలయం లో తెలంగాణ రాష్ట్ర తొలి ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ మా పెద్దన్న డా: పిడమర్తి రవన్న గారితో మర్యాద పూర్వకంగా కలసిన తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర నాయకులు చిరుమర్తి రాజు, రమేష్ గౌడ్

# మహిళల హక్కుల కోసం... ఢిల్లీకి తెలంగాణ మహిళా కాంగ్రెస్!

రేపు (జూలై 21) ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద అఖిల భారత మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి అల్కా లాంబా గారి నాయకత్వంలో "ఆజ్ కరో -- అబ్ హీ కరో" నినాదంతో మహిళా రిజర్వేషన్‌ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా మహా ధర్నా నిర్వహించబడుతుంది. తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి ఎర్రబెల్లి స్వర్ణ



గారి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం నుంచి భారీ సంఖ్యలో మహిళా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఈ ఉద్యమంలో పాల్గొని మహిళల హక్కుల కోసం గళం విప్పనున్నారు.

పార్లమెంట్‌లో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం, జనాభా లెక్కలు మరియు నియోజకవర్గాల పునర్విభజన పేరుతో దాని అమలును నిరవధికంగా వాయిదా వేయడం మహిళలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోవడమేనని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడుతోంది.

మా డిమాండ్ ఒక్కటే --- మహిళా రిజర్వేషన్ ఇప్పుడే అమలు చేయాలి!
ఆజ్ కరో -- అబ్ హీ కరో
డా. రేఖ బోయలపల్లి
వైస్ ప్రెసిడెంట్
తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్






ఈరోజు సోమాజిగూడలో అంకిత హాస్పిటల్స్ అధినేత, మానకొండూరు శాసనసభ్యులు టీపీసీసీ ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సార్ గారి సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ మేడం గారి పుట్టినరోజు సందర్భంగా వారి నివాసంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ డిపార్ట్మెంట్ చైర్మన్ క్యారగారి శ్రీధర్ గారి ఆధ్వర్యంలో మేడం గారికి కేక్ కట్ చేసిన అనంతరం పూలగుచం ఇచ్చి షాలువతో ఘనంగా సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి. ఘనంగా పుట్టినరోజు వేడుకలు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, మాజీ గ్రాూజా డైరెక్టర్ రావుల లింగం గారు, వీవీజ ఎస్సీ డిపార్ట్మెంట్ వైస్ చైర్మన్ మైత్రి ఆనంద్ గారు,యువ నాయకులు చింతపట్ల పవన్ కుమార్ గారు,సీనియర్ నాయకులు మదారి భాస్కర్ గారు, యువ నాయకులు తడకల నితీష్ గారు మరియు తదితరులు పాల్గొన్నారు.



# మానవత్వానికి ప్రతిరూపం... సేవకు చిరునామా... పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మా పేదోళ్ల డాక్టరమ్మ!!

మహోన్నతమైన వైద్యసేవను తన జీవిత ధ్యేయంగా ఎంచుకుని, అనంతరం ప్రజాల సేవలోకి అడుగుపెట్టి...




"మానకొండూర్ నియోజకవర్గ ప్రజలే నా కుటుంబం" అనే పవిత్ర భావనతో ప్రతి ఇంటి కష్టాన్ని తన కష్టంగా, ప్రతి పేదవాడి కన్నీటిని తన కన్నీటిగా భావిస్తూ, నిరంతరం పేదల సంక్షేమం, ప్రజల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న అపూర్వ సేవామూర్తి...

మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారి సతీమణి అంకిత్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్,మా డా.కవ్వంపల్లి అనురాధమ్మ గారికి జన్మదిన శుభాకాంక్షలు.????????

మీ... ఆత్మీయులు గుర్రం కోటేష్
టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్
నకిరేకల్ నియోజకవర్గం



మా దైవ సామానులు టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, మానకొండూర్ నియోజకవర్గ శాసనసభ్యులు డా. కవ్వంపల్లి సత్యనారాయణ గారి సతీమణి డా.కవ్వంపల్లి అనురాధమ్మ గారి జన్మదిన సందర్భంగా మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి గారి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది...

ఈ కార్యక్రమంలో ూవీజ చైర్మన్, గ్రాూజూ చైర్మన్, డైరెక్టర్లు, కాంగ్రెస్ మండల నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు మరియు ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని
విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు...
మీ... కోటేష్ గుర్రం
టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్
నకిరేకల్ నియోజకవర్గం






# నకిరేకల్‌లో వంటెపాక యేసు రత్నం జ్ఞాపకార్థం ఘన నివాళులు



**నకిరేకల్, జులై 20 (అన్వేషనేత్రం ప్రతినిధి ):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, స్థానిక ఎమ్మెల్యే వీరేశం బావగారు వంటెపాక యేసు రత్నం జ్ఞాపకార్థం సోమవారం నకిరేకల్‌లో నిర్వహించిన స్మారక కార్యక్రమంలో నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వేముల రామచంద్రయ్యతో పాటు జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పొకల దేవదాస్, నాయకులు పందిరి రమేష్, దేశపాక రాజేష్, కందాటి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, వంటెపాక యేసు రత్నం కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు విశేష కృషి చేశారని కొనియాడారు. ప్రజలతో మమేకమై సేవాభావంతో పనిచేసిన ఆయన జీవితం అందరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత సేవ చేయడం ద్వారానే నిజమైన నివాళి అర్పించిన వారమవుతామని నాయకులు అన్నారు.




**మునుగోడు నియోజకవర్గం:-**

మునుగోడు మండలం కోతులారం గ్రామంలో కోతులారం నుండి కొంపల్లి గ్రామం వరకు 19 కోట్ల 50 లక్షల రూపాయల వ్యయంతో 6.2 కిలోమీటర్ల మేర ఆర్ అండ్ బి రోడ్డు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన గౌరవ మునుగోడు శాసనసభ్యులు శ్రీ కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి గారు... కార్యక్రమంలో పాల్గొన్న ఆర్ అండ్ బి శాఖ అధికారులు స్థానిక నాయకులు..









తేదీ 20.07.2026. సోమవారం

ఈరోజు నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయములో జరిగే సమీక్ష సమావేశానికి వెళ్తున్న గౌ.శ్రీ. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు తెలంగాణ బారి నీటి పారుదల శాఖ మంత్రి గారిని చిట్యాల లో గౌ.శ్రీ. వేముల వీరేశం గారు ప్రభుత్వ విప్ శాసనసభ్యులు నకిరేకల్ గారు ఆయనను చిట్యాల లో ఆపి శాలువ తో బోకెతో స్వాగతం పలికినారు ఆయన తో పాటు పాల్గొన్న పోకల దేవదాస్ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి నల్లగొండ



ఈరోజు మన గౌ మీూా వీరేశం అన్న గారి బావ గారు వంటెపాక యేసు రత్నం గారి దశ దిన కర్మ కార్యక్రమము సోమవారం నకిరేకల్ లో జరిగిన కార్యక్రమములో పాల్గొన్న పోకల దేవదాస్ పందిరి రమేష్ దేశపాక రాజేష్ కందాటి కృష్ణా రెడ్డి

# బీసీల లక్ష్యం ఇక రాజ్యాధికారమే

## చట్టసభల్లో ప్రాతినిధ్యం పెరిగితేనే హక్కులకు భరోసా: రాఘవేంద్ర గౌడ్

**నల్లగొండ,జులై 20 ( అన్వేషనేత్రం ప్రతినిధి ) :**

బీసీలు ఇకపై రిజర్వేషన్లకే పరిమితం కాకుండా రాజ్యాధికారం సాధన లక్ష్యంగా ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని బీసీ రాజ్యాధికార వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు ఐతగోని రాఘవేంద్ర గౌడ్ అన్నారు. నల్లగొండ పట్టణంలో సోమవారం నిర్వహించిన బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆత్మీయ సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీసీలంటే కేవలం వెనుకబడిన తరగతులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు మాత్రమే కాదని, అగ్రవర్ణాల్లోని పేదలు కూడా సామాజికంగా వెనుకబడిన వర్గాలేనని పేర్కొన్నారు. బీసీల మధ్య చిచ్చు పెట్టి వారిని విభజించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. బీసీలకు చైతన్యం లేదనే ప్రచారాన్ని ఓటు అనే ప్రజాస్వామ్య ఆయుధంతో తిప్పికొట్టాల్సిన అవసరం ఉందన్నారు. ఇన్నాళ్లు అగ్రవర్ణ నాయకుల రాజకీయ ఎదుగుదలకు బీసీలు వెన్నుదన్నుగా నిలిచారని, ఇకపై బీసీ బిడ్డలే అధికారంలోకి రావాలనే సంకల్పంతో రాజకీయాలకు అతీతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలనే కార్యాచరణగా తీసుకుని క్షేత్రస్థాయిలో పనిచేస్తేనే ప్రజల విశ్వాసం లభిస్తుందని, నాయకులు ప్రజల మధ్య నుంచే ఎదుగుతారని చెప్పారు. ఇటీవల తమిళనాడులో జరిగిన ఎన్నికల్లో రాజకీయ నేపథ్యం లేని సామాన్యులు చట్టసభలకు ఎన్నిక కావడం ఇందుకు నిదర్శనమని వివరించారు. బీసీలకు పెన్షన్లు, రేషన్ కార్డులు అందించడం కంటే పాలనా వ్యవస్థలో



భాగస్వామ్యం కల్పించడమే నిజమైన సాధికారత అని అన్నారు. స్థానిక పరిశ్రమల్లో బీసీలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తే వారు ఆర్థికంగా బలోపేతమై ప్రభుత్వానికి పన్నులు చెల్లించే స్థాయికి చేరుకుంటారని, ఎవరి వద్దా చేయి చాపాల్సిన అవసరం ఉండదని పేర్కొన్నారు. బీసీల జీవన ప్రమాణాలు మెరుగుపడాలన్నా, హక్కులు పరిరక్షించబడాలన్నా చట్టసభల్లో వారి ప్రాతినిధ్యం పెరగాల్సిందేనని, అందుకు బీసీ రాజ్యాధికారమే ఏకైక మార్గమని రాఘవేంద్ర గౌడ్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు పిల్లి రామరాజు యాదవ్, మిరియాల యాదగిరి, కొండూరు సత్యనారాయణ, కొంపెల్లి భిక్షపతి, గోపనబోయిన రమణ ముదిరాజ్, గుండు వెంకటేశ్వర్లు, పెండెం ధనంజయ్, కట్టెల శివ, బోనగిరి సురేందర్, కర్నాటి యాదగిరి, చింతపల్లి శ్రీనివాస్ గౌడ్, వడ్డేపాక యాదయ్య, నజీర్, ఖదీర్, వెంకట్ నరసయ్య, చిలకరాజు చెన్నయ్యతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉచిత కంటి వైద్య శిబిర నిర్వహణ అభినందనీయం

## వార్డు ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిక లక్ష్యాది





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూలై: 20 ( అన్వేషనేత్రం ):**

వార్డు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్యం శిబిరం అభినందనీయం అని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు.సోమవారం 47వ వార్డులో కౌన్సిలర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్ ఆధ్వర్యంలో ఏ ఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి,రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోతు భాస్కర్, మున్సిపల్ చైర్ పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, నేరెళ్ల మధు గౌడ్, రాజు తదితరులు పాల్గొన్నారుఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కంటి సంబంధిత సమస్యలతో బాధపడుతున్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమాజ సేవా దృక్పథంతో ఈ క్యాంప్ ఏర్పాటు చేసిన కౌన్సిలర్ జహీర్ గారిని, ఏ ఆర్ కంటి ఆసుపత్రి నిర్వాహకులు పాషా గారిని ప్రత్యేకంగా అభినందించారు.నేత్ర పరీక్షలపై నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవాలని, 40 సంవత్సరాలు దాటిన వారు పరీక్షలు చేసుకోవాలని సూచించారు.



# వాతావరణ ప్రతికూల పరిస్థితులపై సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రులు, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య గారు.

**నల్గొండ, జూలై 20:**

రాష్ట్రంలో కొనసాగుతున్న వర్షాలు, వాతావరణ ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టేందుకు నల్గొండలోని ఐడీఓసీ (×ఖూజ) కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా కలెక్టర్లు, పోలీసు అధికారులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పౌర సరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి శ్రీ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి గారు, ఉమ్మడి నల్గొండ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు, రాష్ట్ర రోడ్లు, భవనాలు ఢ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి శ్రీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి గారు పాల్గొన్నారు. వీరితో పాటు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు సమావేశానికి హాజరయ్యారు.సమావేశంలో ఉమ్మడి నల్గొండ జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాల ప్రభావం, వరద ముప్పు, ప్రజల భద్రత, వ్యవసాయ రంగంపై ప్రభావం, అత్యవసర సహాయక చర్యలు వంటి అంశాలపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ప్రస్తుత పరిస్థితుల్లో రైతులు నష్టపోకుండా వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా పంటల పరిస్థితిని పరిశీలించాలని, అవసరమైతే ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రులు సూచించారు. పంటల నష్టాన్ని ఎప్పటికప్పుడు అంచనా వేసి అవసరమైన నివేదికలను ప్రభుత్వానికి అందజేయాలని అధికారులను ఆదేశించారు.భారీ వర్షాల కారణంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని, చెరువులు, వాగులు, కల్వర్టులు, రహదారులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తాగునీటి సరఫరా, విద్యుత్ అంతరాయాల నివారణ, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, అత్యవసర స్పందన బృందాలు సిద్ధంగా ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు....అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, విపత్తు నిర్వహణ యంత్రాంగాన్ని అప్రమత్తంగా ఉంచాలని సమావేశంలో స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్య గారు మాట్లాడుతూ, ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే శ్రీ బీర్ల అయిలయ్యా గారు మాట్లాడుతూ, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల వారీగా రైతులకు అవగాహన కల్పిస్తూ, నేల స్వభావం, వర్షపాతం పరిస్థితులకు అనుగుణంగా ఏ పంటలు సాగు చేయాలనే అంశంపై సాంకేతిక సలహాలు అందించాలని కోరారు.ఆలేరు నియోజకవర్గంతో పాటు ఉమ్మడి నల్గొండ జిల్లాలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖల అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన సాంకేతిక సూచనలు, ప్రభుత్వ సహాయ సహకారాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. భారీ వర్షాలు, వరదలు లేదా వాతావరణ ప్రతికూల పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో తక్షణ సహాయక చర్యలు చేపట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని, ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ప్రజలకు అండగా ఉంటుందని బీర్ల అయిలయ్య గారు స్పష్టం చేశారు.











# ప్రజా ప్రభుత్వంలో క్రమం తప్పకుండా ఉద్యోగ నోటిఫికేషన్లు




.కేవలం ఏడాదిలోనే 70 వేల ఉద్యోగాలు కల్పించాం
.పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఉద్యోగాలు ఎందుకివ్వలేదు
. .వారి హయాంలో కుటుంబ సభ్యులకే ఉద్యోగాలు
అవినీతి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూకటివేళ్లతో పెకిలించాం..
మీ.
శ్రీమతి చింతల నిర్మల గోవర్ధన్ రెడ్డి గారు.
తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ మహిళ వైస్ ప్రెసిడెంట్

# ఆధునిక సదుపాయాలతో 'బజరంగ్ సానిటరీ అండ్ ఎలక్ట్రికల్స్' ప్రారంభం



**నల్లగొండ, జులై 20 (అన్వేషనేత్రం ప్రతినిధి ):**

నల్లగొండ నగరంలోని దేవరకొండ రోడ్డుపై నూతనంగా ఏర్పాటు చేసిన బజరంగ్ సానిటరీ అండ్ ఎలక్ట్రికల్స్ ప్రదర్శన విక్రయ కేంద్రాన్ని నగర మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి ఘనంగా ప్రారంభించారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కొబ్బరికాయ కొట్టి, రిబ్బన్ కత్తిరించి విక్రయ కేంద్రాన్ని ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. మేయర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన సానిటరీ సామగ్రి, విద్యుత్ పరికరాలు, రంగులు తదితర ఉత్పత్తులను అందిస్తూ విశ్వసనీయ సేవలతో సంస్థ మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు. ప్రజల ఆదరణతో ఈ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని కోరారు. ప్రారంభోత్సవానికి డిప్యూటీ మేయర్ అశ్రఫ్ అలీ అమీర్, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గుమ్మల మోహన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ ఉపాధ్యక్షుడు అబ్బగోని రమేష్, కార్పొరేటర్లు పిల్లి కృష్ణమరాజు, రమ్యశ్రీ రాఖి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, మాజీ కౌన్సిలర్లు జానయ్య, ప్రదీప్ కుమార్‌తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు, వినియోగదారులు పెద్ద సంఖ్యలో హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వాహకులు బెల్లి దానయ్య, బదం సింగ్, జగదీష్ సింగ్, వీరోసింగ్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులతో పాటు మెరుగైన సేవలు అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. ఆధునిక విడిభాగాలు, విస్తృత శ్రేణి సానిటరీ సామగ్రి, విద్యుత్ పరికరాలు, రంగులు ఒకేచోట అందుబాటులో ఉంచిన ఈ విక్రయ కేంద్రం వినియోగదారుల అవసరాలను సమర్థంగా తీర్చగలదని పేర్కొన్నారు.

# మత్స్యకారుల సహకార సంఘానికి కొత్త పాలకవర్గం ఎన్నిక

**నల్లగొండ, జులై 20 ( అన్వేషనేత్రం ప్రతినిధి):**



నల్గొండ జిల్లా నకిరేకల్ మండలం మూసి గ్రామంలోని మత్స్యకారుల మార్కెటింగ్ సహకార సంఘం లిమిటెడ్ పాలకవర్గ ఎన్నికలను తెలంగాణ సహకార సంఘాల చట్టం--1964లోని సెక్షన్ 31-బి, తెలంగాణ సహకార సంఘాల నియమాలు--1964లోని నియమం 22 ప్రకారం నిర్వహించినట్లు అదనపు రిజిస్ట్రార్, రాష్ట్ర సహకార ఎన్నికల ప్రాధికార సంస్థ ధృవీకరించింది. పోటీ ఎన్నికలు జూన్ 25, 2026న రహస్య బ్యాలెట్ విధానంలో, అనంతరం పదవుల ఎన్నిక జూలై 20, 2026న నిర్వహించారు. ఈ ఎన్నికల్లో అలువాల వెంకటస్వామి అధ్యక్షుడిగా, భూపతి జనకిరాములు ఉపాధ్యక్షుడిగా, అంజమ్మ అంబటి కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అలాగే అంజయ్య పెరెల్లి, గోదాడాటి చంద్రమ్మ, సాదుల నర్సయ్య, భూపతి శ్రీనివాస్, అల్లి రామ్ మోహన రాజు, భాతిని సైదులు, గోదాడాటి రవి, వెలుగు సైదులు, ఎదుల సురేష్, మాడ లక్ష్మీనారాయణ పాలకవర్గ సభ్యులుగా ఎన్నికైనట్లు ప్రకటించారు. నూతన పాలకవర్గం పదవీకాలం 2026 జూన్ 25 నుంచి ప్రారంభమై 2031 జూన్ 24తో ముగియనున్నట్లు ఎన్నికల ధృవీకరణ పత్రంలో పేర్కొన్నారు.



# ఖాసీంపేటలో ఘనంగా బేతెస్థ మినిస్ట్రీస్ 19 వ వార్షికోత్సవం

వ్యవస్థాపకులు బిషప్ దుర్గం ప్రభాకర్

రెవ. దుర్గం కరుణ శ్రీ ( హెప్సిబా )

పాస్టర్ డా అబ్రాహాము జార్జీ వెన్మాని - కేరళ










**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూలై :20 ( అన్వేషనేత్రం):**

స్థానిక ఖాసీంపేట 4వ వార్డు సూర్యాపేట నందు బేతెస్థ మినిస్ట్రీస్ 19 వ వార్షికోత్సవం సోమవారం బిషప్ దుర్గం ప్రభాకర్ కరుణ శ్రీ ( హెప్సిబా ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్య ప్రసంగికులు పాస్టర్ డా. అబ్రాహాము జార్జి వెన్మాని - కేరళ పాల్గొని దేవుని వాక్యాన్ని బోదించగా పాస్టర్ వై. యేసురత్నం నల్గొండ తర్జుమా చేశారు.అనంతరం పాస్టర్ వెయ్యి మంది భక్తులకు ప్రేమ విందు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా పాస్టర్స్ కు శాలువా మెమోంటో తో సత్కరించారు బిషప్ దుర్గం ప్రభాకర్ హెప్సిబా మాట్లాడుతూ ఎన్నో శ్రమల మధ్యలో అన్నో అద్భుతాలు చేసి దేవుడు ఈ 19 సంవత్సరాలు కాపాడిన యేసు క్రీస్తు దేవాతి దేవునికి కృతజ్ఞతలు తెలియపర్చుచున్నాము అనీ అన్నారు.ఈ కార్యక్రమం లో సూర్యాపేట జిల్లా పాస్టర్స్ పెలోషిప్ అధ్యక్షులు బిషప్ గడ్డం డేవిడ్ రాజు, సూర్యాపేట నియోజకవర్గ అధ్యక్షులు రెవ. డా జలగం జేమ్స్, రెవ. ఏర్పుల క్రీస్తోఫర్, పాస్టర్ యం. రూబెన్, టి. కిరణ్ బాబు, పాస్టర్ కొండేటి లాజర్, యం. క్రీస్తోఫర్,పాతకోటి దేవదానం, స్థల దాతలు పాస్టర్ సిరపంగి జార్జి, సిరపంగి ప్రకాశం బోనగిరి స్టిఫెన్, కొమ్ము హోసన్నా తదితరులు పాల్గొన్నారు.

# చేనేతకు చేయూత.. ప్రభుత్వానికి పద్మశాలీల కృతజ్ఞత

**నల్లగొండ /మునుగోడు,జూలై 20 (అన్వేషనేత్రం ప్రతినిధి )**

: అంతరించిపోతున్న చేనేత రంగానికి తెలంగాణ ప్రభుత్వం విశేష ప్రాధాన్యం కల్పిస్తోందని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత అన్నారు. సోమవారం మునుగోడు పట్టణంలోని చేనేత సహకార సంఘం పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో చేనేత రంగం నిర్లక్ష్యానికి గురైందని, ఇచ్చిన హామీలు అమలు కాకపోవడంతో నేయుగాళ్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాల్లో సుమారు రూ.2,000 కోట్లను చేనేత రంగ అభివృద్ధికి కేటాయించి నేయుగాళ్లకు అండగా నిలిచిందని కొనియాడారు. గత ప్రభుత్వంలో చేనేత చీరల పేరుతో సూరత్ మిల్లుల వస్త్రాలను పంపిణీ చేశారని విమర్శించారు. చేనేత వర్గాల పట్ల జరిగిన అన్యాయానికి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. గత ప్రభుత్వ బకాయిలుగా ఉన్న




సుమారు రూ.300 కోట్ల చెల్లింపులు, రూ.50 కోట్ల రుణమాఫీ, ఇందిరమ్మ చీరల కోసం రూ.200 కోట్లతో పాటు మొత్తం రూ.600 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే ప్రతి చేనేత కుటుంబానికి మగ్గానికి రూ.24 వేల ఆర్థిక సాయం అందించడంతో పాటు, రూ.5 లక్షల బీమా రక్షణ కల్పించే 'నేతన్న భీమా' పథకం ద్వారా నేయుగాళ్ల కుటుంబాలకు భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. చేనేత పద్మశాలి వర్గాల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి చేనేత సమాజం ఎల్లప్పుడూ రుణపడి ఉంటుందని పేర్కొన్నారు. 2029లో జరిగే శాసనసభ ఎన్నికల్లో చేనేత వర్గాల ఆశీర్వాదం ఆయనకే దక్కుతుందని, మరోసారి రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపడతారనే విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

# ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

ప్రజావాణి లో వచ్చిన దరఖాస్తులు 106

అదనపు కలెక్టర్ బి హరిసింగ్





**సూర్యాపేట జిల్లా ప్రతినిధి జూలై: 20 ( అన్వేషనేత్రం ):**

ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ బి హరిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా మరియు డివిజన్ స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. పాత ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను వెంటనే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. అధికారులు ప్రజలు పెట్టుకున్న అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా, నిర్ణీత గడువులోగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డివిజన్ స్థాయి ప్రజావాణికి అన్ని శాఖల డివిజనల్ అధికారులు తప్పనిసరిగా హాజరయ్యేలా జిల్లా అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు.సోమవా రం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం లో భూ సమస్యలకి సంబంధించి 68 దరఖాస్తులు, డీపీఓ 4, డిడబ్ల్యుఓ 4, డి ఆర్ డి ఓ 3, డి ఇ ఓ 3, మిగిలిన 24 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని మొత్తం 106 దరఖాస్తులు వచ్చాయాని వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అదనపు కలెక్టర్ ఈ సందర్భంగా అన్నారు.ప్రజావాణి కార్యక్రమానికి డిఆర్ఓ ప్రేమ్ రాజ్ అధికారులు తదితరులు హాజరైనారు.






RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

# ఆట



# మైదానంలో తీవ్ర ఉద్రిక్తత

## అర్జెంటీనా ప్లేయర్ తలపై కొట్టిన ఇంగ్లాండ్ స్టార్

ఫిఫా వరల్డ్ కప్ 2026 రెండో సెమీఫైనల్ మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో ఊహించని షాకింగ్ డ్రామా నడిచింది. అర్జెంటీనా చేతిలో 2–1 తేడాతో ఇంగ్లాండ్ ఘోర పరాజయం పాలై టోర్నీ నుంచి నిష్క్రమించింది. అయితే, రెఫరీ ఫైనల్ విజిల్ వేసిన వెంటనే, మ్యాచ్‌ను గెలిచిన ఆనందంలో అర్జెంటీనా ఆటగాళ్లు సంబరాలు చేసుకుంటుండగా, ఇంగ్లాండ్ స్టార్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హామ్ తీవ్ర అసహనానికి గురయ్యాడు. ఓటమి భారంతో కోపంతో ఊగిపోయిన బెల్లింగ్‌హామ్, ఒక అర్జెంటీనా ఆటగాడి వద్దకు వెళ్లి అతడి తలపై కొట్టాడు. దీంతో మైదానంలో ఒక్కసారిగా ఉత్కంఠ, ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. నిజానికి మ్యాచ్ చివరి నిమిషం వరకు ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య తీవ్రమైన పోటీ నడిచింది. చివరి నిమిషాల్లో కమ్ బ్యాక్ ఇచ్చిన అర్జెంటీనా.. వరుసగా రెండోసారి ఫైనల్ చేరింది. దీంతో ఇంగ్లాండ్ ఆటగాళ్లు తీవ్ర ఒత్తిడి, నిరాశకు గురయ్యారు. మ్యాచ్ ముగిశాక అర్జెంటీనా ఆటగాళ్ల సంబరాలు స్లెడ్జింగ్ బెల్లింగ్‌హామ్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించినట్లు తెలుస్తోంది. దీంతో సహనం కోల్పోయిన జూడ్.. అర్జెంటీనా ఆటగాడు బార్కో తలపై కొట్టాడు. బార్కో ఏదో అన్న తర్వాతే జూడ్.. కొట్టినట్లు తెలుస్తోంది. ఇది జరిగిన వెంటనే అర్జెంటీనా ఆటగాళ్లు వెంటనే బెల్లింగ్‌హామ్‌ను చుట్టుముట్టారు. దాంతో ఇరు జట్ల ఆటగాళ్ల మధ్య పెద్ద ఎత్తున తోపులాట, వాగ్వాదం చోటుచేసుకుంది. మైదానంలో వాతావరణం మరింత వేడెక్కడంతో వెంటనే మిగతా ఆటగాళ్లు.. కగలజేసుకుని, ఇద్దరికీ సర్ది చెప్పారు. ఇక ఇదే మ్యాచులో మెస్సీతోనూ ఓ దశలో ఇంగ్లాండ్ స్టార్ బెల్లింగ్‌హామ్ వాగ్వాదానికి దిగాడు. క్రికెట్‌లో భారత్, పాక్ మ్యాచ్ అంటే ఎంత క్రేజ్ ఉంటుందో.. ఫిఫా ప్రపంచకప్‌లోనూ అర్జెంటీనా, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు అంతే క్రేజ్ ఉంది. ఫాక్ లాండ్ దీవుల కోసం 1982లో ఈ రెండు దేశాల మధ్య సుమారు 74 రోజుల పాటు ఘర్షణ జరిగింది. ఇంగ్లాండ్ పైచేయి సాధించడంతో.. అర్జెంటీనా సంధి కుదుర్చుకుంది. ఈ ఘర్షణల్లో ఇరు దేశాలకు చెందిన సుమారు 900 మంది సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇది గుర్తుపెట్టుకున్న అర్జెంటీనా ఆటగాళ్లు మ్యాచ్ తర్వాత 'ఫాక్ లాండ్స్ అర్జెంటీనాదే' అని రాసి ఉన్న బ్యానర్‌ను ప్రదర్శించడం గమనార్హం. దీంతో ఈ విషయంపై ఇప్పటికీ రెండు దేశాల మధ్య వైరం కొనసాగుతోందని స్పష్టమైంది.

# పాకిస్థాన్ ఖాతాలో చెత్త రికార్డు!

క్రికెట్ మైదానంలో సున్నా పరుగులకే వెనుదిరగడం ఏ బ్యాటర్‌కైనా అత్యంత నిరాశపరిచే, ఇబ్బందికరమైన క్షణం. ఒకే వన్డే మ్యాచ్‌లో ఒకరిద్దరు ఘోరంగా వైఫల్యం చెందితేనే జట్టు తీవ్ర ఒత్తిడిలోకి వెళ్తుంది. అలాంటిది ఒకే ఇన్నింగ్స్‌లో ఏకంగా ఆరుగురు బ్యాటర్లు కనీసం పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరితే ఆ జట్టు పరిస్థితి అత్యంత ఘోరంగా మారుతుంది. వన్డే క్రికెట్ సుదీర్ఘ చరిత్రలో ఇలాంటి అవమానకరమైన రికార్డు ఇప్పటివరకు కేవలం ఆరు సార్లు మాత్రమే ప్రపంచ వ్యాప్తంగా నమోదైంది. ఈ అపఖ్యాతిని, అవాంఛిత రికార్డులను మూటగట్టుకున్న జట్లలో క్రికెట్ చరిత్ర కలిగిన పాకిస్థాన్ జట్టు అగ్రస్థానంలో నిలిచింది. ఒకే వన్డే ఇన్నింగ్స్‌లో అత్యధికంగా ఆరుగురు ఆటగాళ్లు డకౌట్ అయిన ఘోరమైన రికార్డును పాక్ క్రికెట్ జట్టు చరిత్రలో మూడు సార్లు నమోదు చేయడం విశేషం. ఈ అనామక జాబితాలో పాకిస్థాన్‌తో పాటు దక్షిణాఫ్రికా, జింబాబ్వే, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) జట్లు కూడా ఒక్కోసారి ఈ అత్యంత ఘోరమైన అవమానాన్ని చవిచూశాయి. ఈ అవమానకరమైన ప్రయాణాన్ని పాకిస్థాన్ జట్టు 1987 మే 25న ఇంగ్లాండ్‌తో బర్మింగ్‌హామ్ వేదికగా జరిగిన మ్యాచ్‌తో ఆరంభించింది. బర్మింగ్‌హామ్ వన్డేలో పాక్ జట్టులో ఆరుగురు ఆటగాళ్లు ఖాతా తెరవకుండానే ఔటయ్యారు. అయితే ఆరుగురు డకౌట్ అయినా ఆ మ్యాచ్‌లో పాక్ జట్టు 9 వికెట్ల నష్టానికి 213 పరుగులు సాధించడం విశేషం. ఆ తర్వాత 1993 ఫిబ్రవరి 25న కేప్‌టౌన్‌లో కేవలం 43 పరుగులకే కుప్పకూలిన మ్యాచ్‌లోనూ పాకిస్థాన్‌కు చెందిన ఆరుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే వెనుదిరిగి మరోసారి ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు.ఆ తర్వాత కాలంలో కూడా పాకిస్థాన్ బ్యాటింగ్ లైనప్ తన సంప్రదాయాన్ని కొనసాగిస్తూ 2012 జూన్ 16న కొలంబో వేదికగా శ్రీలంకతో జరిగిన వన్డే మ్యాచ్‌లో మూడోసారి ఈ ఘోర పతనాన్ని చవిచూసింది. లంక నిర్దేశించిన లక్ష్య ఛేదనలో పాక్ జట్టు 199 పరుగులు చేసింది. అయినప్పటికీ ఈ ఇన్నింగ్స్‌లో కూడా ఆరుగురు ఆటగాళ్లు డకౌట్ కావడంతో వన్డేల చరిత్రలోనే అత్యధికంగా మూడు సార్లు ఈ దారుణమైన రికార్డును మూటగట్టుకున్న ఏకైక జట్టుగా పాకిస్థాన్ నిలిచింది. పాకిస్థాన్ కాకుండా ఇతర ప్రధాన దేశాల్లో బలమైన జట్టుగా పేరున్న దక్షిణాఫ్రికా కూడా ఈ చెత్త రికార్డును నమోదు చేసింది. 2002 జనవరి 22న సిడ్నీ వేదికగా ఆస్ట్రేలియా చేతిలో జరిగిన మ్యాచ్‌లో ప్రొటీస్ జట్టు 106 పరుగులకే ఆలౌట్ కాగా..ఏకంగా ఆరుగురు బ్యాటర్లు సున్నాకే వెనుదిరిగారు. అనంతరం 2008 నవంబర్ 20న హరారే వేదికగా శ్రీలంకతో జరిగిన వన్డేలో జింబాబ్వే బ్యాటర్లు కూడా ఇదే తప్పును పునరావృతం చేస్తూ నిరాశపరిచారు. ఆ జట్టు కూడా కేవలం 127 పరుగులకే పరిమితం కాగా.. ఆరుగురు ఆటగాళ్లు సున్నా పరుగులతో డకౌట్‌గా వెనుదిరిగారు. ఈ చెత్త రికార్డు కలిగిన జట్ల జాబితాలోకి ఇటీవల యూఏఈ (యూనైటెడ్ అరబ్ ఎమిరేట్స్) సరికొత్తగా వచ్చి చేరింది. 2024 నవంబర్ 7న అల్ అమీరత్ వేదికగా ఒమన్‌తో జరిగిన మ్యాచ్‌లో యూఏఈ ఘోర బ్యాటింగ్ వైఫల్యాన్ని చూపించింది. ఈ ముఖాముఖి పోరులో కేవలం 78 పరుగులకే ఆలౌట్ అయిన యూఏఈ జట్టులో సరిగ్గా ఆరుగురు బ్యాటర్లు సున్నా పరుగులకే పెవిలియన్ చేరి ఈ ఘోరమైన రికార్డుల క్లబ్‌లో తమ స్థానాన్ని స్థిరపరుచుకున్నారు. అర్థం చేసుకోవచ్చు. వన్డే క్రికెట్ చరిత్రను పరిశీలిస్తే ఇలాంటి అవమానకర ఫలితాలు కేవలం ఒక సాధారణ పరాజయంగా మాత్రమే మిగిలిపోవు.



# హెచ్ కోచ్ పదవికి హెన్రీచ్ మలాన్ రాజీనామా

టీ20 సిరీస్‌లో భారత్‌ను క్లీన్ స్వీప్ చేసి చరిత్రాత్మకమైన విజయం సాధించిన కొద్ది గంటల్లోనే ఐర్లాండ్ క్రికెట్ జట్టులో భారీ మార్పులు జరిగాయి. ఆ జట్టు హెచ్ కోచ్ హెన్రీచ్ మలాన్ కోచ్ పదవికి రాజీనామా చేస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ రాజీనామా తక్షణమే అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. అయితే ఈ నిర్ణయానికి గల కారణాలు మాత్రం తెలియాల్సి ఉంది. ఏదేమైనా భారత్?లాంటి బలమైన జట్టును 2–0తో క్లీన్ స్వీప్ చేసిన అనంతరం హెడ్ కోచ్ తన పదవికి రాజీనామా చేయడం మాత్రం క్రీడా వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. కాగా, రీసెంట్?గా భారత్ శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో ఐర్లాండ్ పర్యటనకు వెళ్లింది. ఈ టూర్?లో రెండు మ్యాచ్? టీ20 సిరీస్? ఆడింది. అయితే పసికూన ఐర్లాండ్ జట్టు తమ సొంతగడ్డపై వరల్డ్ ఛాంపియన్స్ భారత్?ను వరుసగా రెండు టీ20 మ్యాచ్?ల్లోనూ ఓడించి సరికొత్త చరిత్ర సృష్టించింది. క్రికెట్?లో ఫార్మాట్‌లోనైనా భారత్‌పై ఐర్లాండ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం కావడం విశేషం. ఈ సిరీస్?లో శుక్రవారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 34 పరుగులు తేడాతో ఓడిపోయింది. ఇక ఆదివారం జరిగిన రెండో టీ20లో ఒక్క పరుగు స్వల్ప తేడాతో పరాజయం పాలైంది.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషనేత్రం
ఎడిటర్: గొల్ల రమేష్ తెలుగు దినపత్రిక

# సినిమా
CINEMA





# మహాప్రభు జగన్నాథ్ విడుదలపై స్టే

ఎలీ యానిమేషన్స్ సంస్థ నిర్మించిన మహాప్రభు జగన్నాథ్ చిత్రాన్ని శుక్రవారం రిలీజ్ చేయాల్సి ఉన్నది. కానీ ఆ ఫిల్మ్ రిలీజ్‌పై ఒడిశా హైకోర్టు స్టే విధించింది. దీన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పిటీషన్లు దాఖలు అయ్యాయి. ఈ నేపథ్యంలో ఆ పిటీషన్‌పై శుక్రవారం విచారణ చేపట్టనున్నట్లు సుప్రీంకోర్టు ఇవాళ వెల్లడించింది. చీఫ్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, వీ మోహనాతో కూడిన ధర్మాసనం ఈ కేసులో అభిప్రాయాన్ని వ్యక్తం చేసింది.



# ఆగస్ట్ 15న రానున్న హుషారు పిట్టలు

అన్ను, వాసవి గణెళిషన్ కాంబోలో రూపొందుతోన్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'హుషారు పిట్టలు'. పద్మ అమ్మ, బీవీజీ స్టూడియోస్ సమర్పణలో రుద్రక్రాంతి పిక్చర్స్ పతాకంపై వెంకట్ యాదవ్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి బిక్షు దర్శకుడు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలు ఏషియన్ సురేష్ ఫిలింస్ సంస్థలు విడుదల చేస్తున్నాయి. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని థియేట్రికల్ రిలీజ్ చేస్తున్నారు. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రం టీజర్‌కు అనూహ్యమైన స్పందన వచ్చింది. కాగా తాజా ఈ చిత్రం నుంచి టోంగా టోంగా అనే ఓ హుషారు గీతాన్ని బుధవారం విడుదల చేశారు. చరణ్ అర్జున్ సంగీత దర్శకత్వంలో ఎస్.ఎస్.చిరంజన్ సాహిత్యంతో, మెయిన్ కొరియోగ్రఫీతో ఈ పాట తెరకెక్కింది. దర్శకుడు బిక్షు మాట్లాడుతూ.. ఈ సినిమా టీజర్ తరువాత నన్ను అందరూ సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తూ తిట్టడం స్టార్ట్ చేసి నన్ను పాపులర్ చేశారు. అందరూ ఏదోదో ఊహించుకున్నారు. ఈ సినిమా విడుదల తరువాత సినిమా చూసి అందరూ మీరు సోషల్ మీడియాలో చేసిన నెగెటివ్ కామెంట్స్ వెనక్కి తీసుకుంటారు. అయితే ఇదే సినిమాను ఏ తమిళంలో, మలయాళంలో తీసి టీజర్‌ను విడుదల చేస్తే అందరూ ప్రశంసించేవారు. కానీ తెలుగు వాళ్లు మనకు చిన్న చూపు. తెలుగులో హుషార్ పిట్టలు ట్రెండ్ సృష్టించబోతుంది. విడుదల తరువాత ఇతర భాషల్లో ఈ తెలుగు సినిమా గురించి మాట్లాడుకుంటారు. పుట్ట చిట్టి పాత్రకు వాసవి ప్రాణం పోసింది. అందుకే ఆమె కాళ్లు మొక్కుతున్నాను. ఈ రోజు మా కాన్ఫిడెంట్‌కు కారణం ఏమిటో ఈ సినిమా విడుదల తరువాత అందరికి తెలుస్తుంది' అన్నారు. హీరో అన్ను మాట్లాడుతూ.. నా ఫేవరెట్ సింగర్ మంగ్లీ నా సినిమాలో పాట పాటడం ఆనందంగా ఉంది. ఈ పాటకు మంచి ట్యూన్‌ను చరణ్ అర్జున్ అందించారు. ఈ రోజు నా ఆత్మవిశ్వాసానికి కారణం దర్శకుడు బిక్షు, నిర్మాత వెంకట్. టీజర్ విడుదల చేశాం. చాలా వైరల్ అయ్యింది. టీజర్ చూసి అందరూ మిస్ అండర్ స్టాండింగ్ చేసుకున్నారు. సినిమా చూసిన తరువాత అందరి ఆలోచన మారిపోతుంది.




# నా ఫోటోలు తీయకండి ప్లీజ్: మౌనీరాయ్

బాలీవుడ్ నటి మౌనీరాయ్ ఇటీవల ముంబయిలో ఫొటోగ్రాఫర్లపై ఆసహనం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. రెస్టారెంట్ నుంచి బయటకు వచ్చి కారు ఎక్కిన తర్వాత కూడా ఆమెను కారు అద్దంలో నుంచి కెమెరామెన్‌లు క్లిక్ చేశారు. దీంతో మౌనీరాయ్ వాళ్లను వారించారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నెటిజన్లు విమర్శలు కురిపించారు. దీనిపై తాజాగా ఆమె వివరణ ఇస్తూ పోస్ట్ పెట్టారు. 'నాకు ఫొటోగ్రాఫర్లంటే చాలా గౌరవం ఉంది. కానీ, దయచేసి నన్ను ఫొటోలు తీయకండి. నేను చాలా రోజుల నుంచి మిమ్మల్ని పిలవడం లేదు. ఇకపై కూడా పిలవను. నాకోసం ఎప్పుడూ రాకండి. మీపై గౌరవంతోనే ఈ మాటలు చెబుతున్నా' అని నటి పేర్కొన్నారు. అయితే, కొద్దిసేపటికే ఆమె ఈ పోస్ట్‌ను డిలీట్ చేసినప్పటికీ.. ఆ స్క్రీన్‌షాట్‌లు వైరల్ అయ్యాయి. కొందరు ఆమెను ట్రోల్ చేస్తుండగా.. సెలబ్రిటీలకు కూడా వ్యక్తిగత గోప్యత ఉంటుందని మరికొందరు నెటిజన్లు నటికి మద్దతుగా నిలుస్తున్నారు. ప్రస్తుతం మౌనీ రాయ్ 'విశ్వంభర'లో ఓ ప్రత్యేకపాటతో అలరించనున్నారు. ఇందులో చిరు సరసన స్పెషల్ సాంగ్ చేశారు. దీంతో పాటు భండార్కర్ దర్శకత్వంలో రాబోతున్న 'ది వైవ్స్' చిత్రంలో నటిస్తున్నారు.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434